మారుతి కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..

2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

మారుతి ఈ-విటారా:

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

నయా గ్రాండ్ విటారా

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి వీలుగా డిజైన్ చేసింది.

కొత్త బాలెనో

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్ స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

అప్‌గ్రేడ్ బ్రెజ్జా

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ సంగతి..

సహజంగా రాష్ర్టాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతేకాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

కేసులతో రచ్చ

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరికొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతోపాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మాసిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

టెలికం సంస్థలకు ఇక్కట్లే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారిఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్‌ఎన్‌ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

శాట్కామ్‌ల ఎంట్రీతో..

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పుణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్‌ఎస్‌బీవీఎల్ ..హెల్త్ కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

చెత్త సేకరణకు ట్రాక్టర్ ఏర్పాటు చేయండి

జ్యోతినగర్ (రామగుండం), డిసెంబర్ 28 : రామగుండంలోని 20వ డివిజన్‌లో పెరుకుపోయిన చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేయాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్‌ను డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ప్రకటనలో కోరారు. స్థానికంగా నాలుగు డివిజన్లకు కేవలం ఒక చెత్త ట్రాక్టర్ కేటాయింపుతో డివిజన్‌లో చెత్త పెరుకుపోతుందని మున్సిపల్ సమావేశాల్లో విన్నపించడం, నిరసన వ్యక్తం చేసిన శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని,వారిపై తగు చర్యలు తీసుకోని డివిజన్‌కు మరో ట్రాక్టర్‌ను కేటాయించాలని కార్పొరేటర్ కమిషనర్‌ను కోరారు.

జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ

ముత్తారం, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని పంచాయతీ సిబ్బందికి మండల అభి

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సురేశ్

వృద్ధి అధికారి సురేశ్ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గర్రెపల్లి నరేశ్ గ్రామ పంచాయతీ సిబ్బంది గణేశ్, నరేశ్, కుమార్, శ్రీనివాస్ , రజినీకాంత్ , దుర్గయ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ట్రాక్టర్ ఏర్పాటు చేయండి

జ్యోతినగర్(రామగుండం), డిసెంబర్ 28: రామగుండంలోని 20వ డివిజన్‌లో పెరుకుపోయిన చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేయాలని రామగుండం నగరపా లక సంస్థ కమిషనర్‌ను డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ప్రకటనలో కోరారు. స్థానికంగా నాలుగు డివిజన్‌లకు కేవలం ఒక చెత్త ట్రాక్టర్ కేటాయింపుతో డివిజన్‌లో చెత్త పెరుకుపోతుందని మున్సిపల్ సమావేశాల్లో విన్నపించడం, నిరసన వ్యక్తం చేసిన శానిటేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని, వీరిపై తగు చర్యలు తీసుకోని డివిజన్‌కు మరో ట్రాక్టర్‌ను కేటాయించాలని కార్పొరేటర్ కమిషనర్‌ను కోరారు.

ప్రతి రోజూ 50కి తగ్గకుండా ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేయాలి

కమాన్‌పూర్, డిసెంబర్ 28: ప్రతి రోజూ 50కి తగ్గకుండా ఇందిరమ్మ గృహాలను సర్వే పూర్తి చేయాలని మంథని డీపీవో కొమ్మెర సతీశ్ ఆదేశించారు. మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. సర్వే సమయంలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్నారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని ఆదేశించారు. కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ట్రినిటీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 28 : ఇటీవల సుల్తానాబాద్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 (ఎస్‌జీఎఫ్) రోడ్ సైక్లింగ్ పోటీల్లో పెద్దపల్లి ట్రినిటీ సీబీఎస్ఈ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం స్కూల్ ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు ఎం. సాక్షిత్‌రెడ్డి, పి. ఆరాధ్య, శ్రీహిత, శ్రీవాత్సవ్‌ను ఈ సందర్భంగా విద్యాసంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి అభినందించారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సౌజన్య, పీఈటీలు నితీశ్, మౌనిక, టీచర్లు ఉన్నారు.

సింగరేణి కార్మికుల డ్యూటీ సమయాల్లో మార్పు..

- మారనున్న మూడు షిఫ్టుల సమయాలు
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కార్మికులు

పెద్దపల్లి, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ): సింగరేణిలో పని వేళల్లో మార్పులు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దశబ్ధాల కాలంగా కొనసాగుతున్న సింగరేణి కార్మికుల డ్యూటీ సమయాల్లో సింగరేణి సంస్థ మార్పు చేయనుంది. ఈ మేరకు త్వరలోనే నిర్ణయం చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ప్రస్తుతం అమలు చేస్తున్న షిఫ్టుల కంటే కార్మికుల సమయాన్ని మరింతగా సద్వినియోగం చేసుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీకోబోతున్నది. కొత్తగా భోజన విరామ సమయానికి ముందు, వెనుక పని వేళలు ప్రారంభం కావడం, లేదా ముగిసేలా షిఫ్టులను నిర్ణయించనున్నారు. దీంతో సమయం ఆదా అవుతుందని, ఉత్పత్తి, ఉత్పాదకత మెరుగు పడుతుందని ప్రతిపాదిస్తూ ఇటీవల సమావేశాలు నిర్వహించిన మల్టీడిపార్ట్‌మెంట్, రక్షణ కమిటీలు యాజమాన్యానికి తాజాగా సూచనలు చేశాయి. అయితే ఈ పని వేళల మార్పుపై సింగరేణి కార్మికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న డ్యూటీస సమయాలు ఇలా..

సింగరేణిలో దశాబ్ధాల కాలంగా కార్మికులు ప్రధానంగా మూడు షిఫ్టులలో పని చేస్తున్నారు. అవి ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు, రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల వరకు కొనసాగుతున్నది. డ్యూటీ సమయాలు ఇలా ఉండడంతో మొదటి, రెండో షిఫ్ట్ కార్మికులకు మధ్యాహ్నం, రాత్రి భోజన విరామాన్ని గంట సేపు ఇవ్వాల్సి వస్తోంది. దీనికి బదులుగా ఆయా సమయాలను ఇంటి వద్దే పూర్తి చేసుకొనేలా కొత్తగా ప్రతిపాదనలను సిద్ధం చేశారు.

ప్రతిపాదిత కొత్త డ్యూటీ సమయాలు ఇలా..

సింగరేణి ప్రారంభం నుంచి కొనసాగుతున్న డ్యూటీ సమయాల్లో మార్పు చేయడం అనివార్యంగా భావిస్తున్న యాజమాన్యం ఈ మేరకు నూతన సమయాలను మూడు షిఫ్టులుగా విభజించింది. కొత్తగా ప్రతిపాదించిన డ్యూటీ సమయాలు ఈ క్రింది విధంగా ఉండనున్నాయి.

ఫస్ట్ షిఫ్ట్ : ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుంది. డ్యూటీ తర్వాత కార్మికులు భోజనానికి ఇంటికి వెళ్తారు.

సెకండ్ షిఫ్ట్: మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది. ఈ షిఫ్ట్‌లో పని చేసేవారు మధ్యాహ్న భోజనం ఇంటి వద్ద చేసి, విధులకు వస్తారు. విధి నిర్వహణ అనంతరం తిరిగి ఇంటికి వెళ్లి భోజనం చేస్తారు.

నైట్ షిఫ్ట్: రాత్రి 9గంటల నుంచి ఉదయం 5గంటల వరకు కొనసాగుతుంది. ఇలా చేయడం వల్ల కార్మికులు రాత్రి భోజనం చేసి విధులకు హాజరవుతారు.

అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కార్మికులు..

సింగరేణిలో దశాబ్ధాల కాలంగా కొనసాగుతున్న డ్యూటీ సమయాల మార్పుపై చాలా మంది వరకు కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇలా చేయడంతో తమపై అదనపు భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం ఈ టైమింగ్స్ మార్పును కార్మిక సంఘాలు వ్యతిరేఖించాలంటున్నారు. ఉదయం 5 గంటల సమయం వల్ల కార్మికులకు కంటి నిండా నిద్ర కరువు అవుతుందంటున్నారు. ఈ మూడు సమయాలు సరైన విధంగా లేవని, పాత డ్యూటీ సమయాలనే కొనసాగించాలని కార్మికులు కోరుతున్నారు.

సంఘాలు సమ్మతిస్తేనే మార్పు..



కోలిండియాతో పాటుగా ఇతర ప్రైవేట్ కంపెనీల తరహా కొత్తగా డ్యూటీ సమయాలను మార్చాలనే ప్రతిపాదన ముందుకొచ్చింది. దీనిపై కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకుంటాం. సంఘాలు సమ్మతిస్తేనే ముందుకు సాగుతాం. ఆ తర్వాత పని వేళల మార్పు అమలును పరిశీలిస్తాం. - ఎన్ బలరాం, చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సింగరేణి సంస్థ

'ఇందిరమ్మ'కు తప్పని తిప్పలు

- ఇప్పటిదాకా 70 శాతం సర్వే పూర్తి
- మరో మూడు రోజుల గడువు

జూలపల్లి, డిసెంబర్ 28 : ఇందిరమ్మ పథకం ఇండ్ల సర్వేలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఓ వైపు గడువు దగ్గర పడడం, మరో వైపు సాంకేతిక సమస్యలతో సర్వే ముందుకు సాగడం లేదు. పేదలు సొంతింటి కళ నెరవేర్చడానికి ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా మండల వ్యాప్తంగా 7,559 మంది ఇండ్లు నిర్మించుకోడానికి దరఖాస్తు పెట్టుకున్నారు. అధికారులు అర్హులను గుర్తించడానికి నెల రోజుల నుంచి ఇంటింటా సర్వే పనులు మొదలు పెట్టారు. ఇప్పటి దాకా అధికారులు గ్రామాల్లో పర్యటించి, 4,900 మంది వివరాలు, ఫొటోలు సేకరించారు. మండలంలో మొత్తం 70 శాతం సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి వెల్లడించారు. సర్వే పనులు పూర్తి చేయడానికి ఇంకా మిగిలిన మూడు రోజుల గడువు ఉంది. గ్రామాల్లో మిగతా 30 శాతం సర్వే చేపట్టడానికి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అప్పటికప్పుడూ ఆన్‌లైన్‌లో వివరాలతో పాటు, ఫొటోలు నమోదు చేయడానికి కొన్నిచోట్ల ఒక్కోసారి సిగ్నల్స్ అందక కుస్తీ పడుతున్నారు. తరచూ సర్వర్ డౌన్ కావడంతో ఇం టివద్ద సర్వే చేపడుతున్న సిబ్బంది దాదాపు అరగంట పాటు వేచిచూడాల్సి వస్తోంది.

పెద్దాపూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న గృహ నిర్మాణ శాఖ ఈఈ రాజేశ్వర్

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ధర్మారం, డిసెంబర్ 28: మండలంలోని కమ్మర్ ఖాన్ పేటకు చెందిన గుజ్జేటి నరేశ్ (32) శుక్రవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్సై శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్ ఆర్థిక సమస్యలతో మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తి చెంది తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉంది. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు పెంచికల్ పేటలో వైద్య శిబిరం

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 28: సింగరేణి వకీల్‌పల్లి గని ప్రభావిత గ్రామం పెంచికల్‌పేటలో సింగరేణి ఆధ్వర్యంలో 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్జీ-2 జీఎం వెంకటయ్య తెలిపారు. నిష్ణాతులైన సింగరేణి వైద్యులతో వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు చర్యలు

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

ఇండ్ల పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పెద్దపల్లి మున్సిపాలిటీలోని చందపల్లి-కూనారం రోడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మౌలిక వసతులను త్వరగా పూర్తి చేసి, అధికారులు వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశించారు. శనివారం డబుల్ బెడ్‌రూం ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. అర్హులైన పేదలకు దశలవారీగా ఇండ్ల కేటాయింపులు జరుగుతాయన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, కౌన్సిలర్లు నెత్తెట్ల స్వరూప-కొమురయ్య, భూతగడ్డ సంపత్, నాయకులు ఉప్పు రాజు, సయ్యద్ మస్రత్, పూదరి మహేందర్, ఫణింద్ర భూపతి పాల్గొన్నారు.

ఒంటరి మహిళలు , వృద్ధులే టార్గెట్‌గా దొంగతనాలు

ఎస్‌ఐ మల్లేశ్

దొంగ అరెస్టు చూపుతున్న ఎస్ఐ మల్లేశ్

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 28 : పెద్దపల్లి-సిద్దిపేట్ జిల్లాల్లో ఒంటరి మహిళలు-వృద్ధ మహిళలే టార్గెట్‌గా చేసుకున్న ఒల్లేపు కృష్ణ (46) అనే దొంగ మహిళల మెడలోని బంగారు ఆభరణాలు, పుస్తెల తాడు లాంటి బంగారం ఎత్తుకెళ్తున్న ఒల్లేపు కృష్ణను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్ఐ-2 మల్లేశ్ తెలిపాడు. శనివారం పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో దొంగ వివరాలు మీడియాకు తెలిపారు. ఎస్ఐ మల్లేశ్ కథనం మేరకు.. పట్టణంలోని పెద్ద మసీద్ వద్ద డిసెంబర్ 25న, బొంపల్లి గ్రామానికి చెందిన గుర్రాల సత్తెమ్మ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా, అవ్వా నీకు పెన్షన్ వస్తలేదా అని మాటలు కలిపి నీ పుస్తెల తాడు తీస్తే నీకు పెన్షన్ వస్తుందని నమ్మబలికి మెడలోని బంగారు పుస్తెల తాడు దొంలించాడని తెలిపారు. ఏసీపీ కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ లక్ష్మణరావు ఆదేశాలతో దొంగతనాలకు పాల్పడిన కృష్ణ నేర చరిత్రపై పెద్దపల్లి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల్లోని పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు తెలుసుకోగా, ఇప్పటికే కృష్ణపైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 80 కేసులు నమోదై జైలు జీవితం గడిపి మరల పలు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. పెద్దపల్లి పట్టణంలోని పలు సీసీ కెమారాల్లో రికార్డులను పరిశీలించగా, వృద్ధురాలు మెడలోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన దొంగ కృష్ణగా నిర్ధారించి ఒల్లేపు కృష్ణ శనివారం పెద్దపల్లి బస్‌స్టాండ్ నుంచి మంచిర్యాలకు వెళ్తున్నాడని అందిన సమాచారం మేరకు.. దొంగను పట్టుకొని విచారణ చేయగా, నాలుగు దొంగతనాలకు పాల్పడినట్లు కృష్ణ ఒప్పుకున్నాడన్నారు. కృష్ణపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మల్లేశ్ తెలిపారు. దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన కానిస్టేబుల్స్‌ను అనంతరెడ్డి, రియాజ్, హోంగార్డు శ్రీనివాస్‌ను ఎస్ఐ మల్లేశ్ అభినందించారు.

పోలీసు కళాజాత

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 28: పట్టణంలోని తిలక్‌నగర్‌లో శనివారం రాత్రి పోలీసు కళా బృందం ఆధ్వర్యంలో పోలీసు కళాజాత కార్యక్రమం నిర్వహించారు. గోదావరిఖని వన్‌టౌన్ రెండో సీఐ కే రవీందర్ సైబర్‌క్రైమ్, ఈవ్‌టీజింగ్, మహిళలపై జరిగే అగాయిత్యాలు, రోడ్డు, ప్రమాదాలు, గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై స్థానికులకు అవగాహన కల్పించారు.

కళాజాతలో సీఐ, సిబ్బంది